క్లుప్తంగా

ప్రజాప్రతినిధులకు అవగాహన సదస్సు

పోలవరం రూరల్: గ్రామాభివృద్ధి ప్రణాళిక రూపొందించే విషయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. పోలవరం వెలుగు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి మాట్లాడుతూ పంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రజాప్రతినిధులు బడ్జెట్ రూపొందించే అంశాలను తెలుసుకోవాలన్నారు. ఎంపీడీవో కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

లింగపాలెం: ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెలాఖరు వరకు మండలంలో పశువైద్య శిబిరాలు నిర్వహిస్తామని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జె.లింగయ్య అన్నారు. మండలంలోని ధర్మాజీగూడెంలో మంగళవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లింగయ్య మాట్లాడుతూ పశువులకు, మేకలకు, గొర్రెలకు ఉచితంగా నట్టల నివారణ టీకాలు, గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించామన్నారు. పాడి రైతులు ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ మహేష్, సచివాలయం వెటర్నరీ అసిస్టెంట్ సూర్య పాల్గొన్నారు.

మద్ది ఆలయంలో పూజలు

జంగారెడ్డిగూడెం: గురవాయిగూడెం గ్రామంలో తెల్ల మద్ది చెట్టు తొర్రలో స్వయంభువుగా వెలిసిన మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం తెల్లవారుజామున అర్చకులు స్వామివారికి ప్రభాతసేవ, నిత్యార్చన పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తమలపాకులతో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన మంగళవారం కావడంతో దర్శనాలకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. భక్తులు శ్రీస్వామి వారి ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం వరకు దేవస్థానానికి వివిధ సేవల రూపంలో రూ.1,23,720 సమకూరినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. సుమారు 1,500 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ఏర్పాట్లను పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు పర్యవేక్షించారు.

పంచాయతీలు సక్రమంగా నిధులు వినియోగించాలి

కామవరపుకోట: గ్రామ పంచాయతీల్లో నిధులను సక్రమంగా వినియోగించడం ద్వారా గ్రామాలను అభివృద్ధి మార్గంలో నడిపించేందుకు అవకాశం ఉంటుందని కామవరపుకోట మండల పరిషత్ అభివృద్ధి అధికారి ముళ్లగిరి సరళకుమారి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల్లో 2025–26 వార్షిక ప్రణాళికలను సిద్ధం చేసేందుకు మండలస్థాయిలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ కడిమి రమేష్, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

3న వసంత పంచమి వేడుకలు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెంలో అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఉపాలయమైన జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో ఫిబ్రవరి 3న వసంత పంచమి వేడుకలు నిర్వహించనున్నట్లు అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తెలిపారు. 3వ తేదీ సోమవారం వసంత పంచమి సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు విశేష పూజ కార్యక్రమాలు, చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తామన్నారు. భక్తులందరూ గమనించి ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది

పోలవరం రూరల్: మండలంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గూటాల-1, కొత్తపట్టిసీమలో స్థానిక రైతు సేవా కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికారులు పంటల రక్షణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ ఏవో కె.రాంబాబు మాట్లాడుతూ దాళ్వా సాగులో మెలకువలను వివరించారు. రైతులందరూ వ్యవసాయశాఖ సిబ్బంది సూచనలు పాటించాలని ఏవో కోరారు.

కొయ్యలగూడెం: యర్రంపేట, గంగన్నగూడెంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఎస్.చెన్నకేశవులు రైతులు తప్పనిసరిగా ఈ–పంట నమోదు చేసుకోవాలని సూచించారు. హబ్ మేనేజర్ బి.సోమశేఖర్ మొక్కజొన్న, వరి పంటలో తీసువాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు.

ఆర్థిక సాయం అందజేత

కామవరపుకోట: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఏలూరుకు చెందిన ముత్తింటి సాయి కిరణ్ కుటుంబ సభ్యులకు మంగళవారం కామవరపుకోట షేర్ అండ్ కేర్ సంస్థ సభ్యులు రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సంస్థ సభ్యులు షేక్ ఇబ్రహీం, వంగాల శ్రీను పాల్గొన్నారు.

రైతు కంట.. మిర్చి మంట

- గిట్టుబాటు ధర రాక రైతుల గగ్గోలు
- వ్యాపారస్తుల సిండికేట్ కారణమని ఆవేదన
- తెగుళ్లతో మరింత సతమతం


లింగపాలెం మండలంలో పచ్చిమిర్చి తోట

లింగపాలెం : ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి పచ్చిమిర్చి సాగుచేస్తే గిట్టుబాటు ధర రావడం లేదని, మరోవైపు తెగుళ్లతో సతమతమవుతున్నామని రైతులు విలవిల్లాడుతున్నారు. జిల్లాలోని పచ్చిమిర్చి సాగులో మెట్టప్రాంతమైన లింగపాలెం మండలం ప్రసిద్ధి చెందింది. మండలంలో ఈఏడాది సుమారు 1,780 ఎకరాల్లో మిర్చిపంటను రైతులు సాగుచేశారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది మండలంలో సుమారు 110 ఎకరాల్లో మిర్చి సాగు పెరిగింది. సీడ్ మొక్కజొన్న ఎక్కువగా డీలర్లు ఇవ్వకపోవటంతో మిర్చి సాగును రైతులు అధికంగా సాగుచేశారు. తేజ, సన్‌గ్రో, క్యాఫ్స్, డిల్లీహాట్ వంటికరాల పంటలను రైతులు సాగుచేశారు. ఇక్కడ పండించిన మిర్చిని వ్యాపారస్తులు బొంబాయి, కలకత్తా, నాగపూర్, హైదరాబాద్, విజయవాడ వంటి ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయిస్తుంటారు. ప్రస్తుతం 62 కిలోల బస్తా రూ.1,250 ధర పలుకుతోంది. అయితే బస్తా పచ్చిమిర్చి కోసేందుకు కూలీలకు రూ.550కు పైగా చెల్లించాలి. ఇప్పటికే ఎకరాకు సుమారు రూ.15 వేలకు పైగా పెట్టుబడులు పెట్టడం జరిగిందని రైతులు అంటున్నారు. దీనికితోడు అనేక కొత్త రకాల తెగుళ్లు వ్యాపించడంతో వేలాది రూపాయలు ఖర్చుచేసి మందులు పిచికారీ చేయాల్సి వస్తుందని అంటున్నారు. పంట అమ్మగా వచ్చిన డబ్బులు కూలీలకు, పురుగుమందులకు మాత్రమే సరిపోతున్నాయని, పెట్టిన పెట్టుబడులు సైతం రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. బస్తా రూ.1800 నుంచి రూ.2000 అయితే తమకు గిట్టుబాటు అవుతుందని చెబుతున్నారు.

వ్యాపారస్తుల సిండికేట్

మిర్చి దిగుబడి బాగున్నా ధర మాత్రం రావడం లేదని, ఇందుకు వ్యాపారస్తులు సిండికేట్ అవడమే కారణమని రైతులు చెబుతున్నారు. వ్యాపారస్తులు అంతా కలిసి మిర్చి ధరను ఒక్కసారిగా తగ్గించివేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు., గతేడాది మిర్చి పంటను సాగుచేసిన రైతులు పెట్టుబడులు రాక అప్పులపాలయ్యారు. ప్రస్తుతం దిగుబడులు కొంతవరకు బాగున్నప్పటికి గిట్టుబాటు ధర రాకపోతే నష్టం తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని మిర్చికి గిట్టుబాటు ధర కల్పించేవిధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


మఠంగూడెంలో ఎగుమతి చేసేందుకు తోటలో కోసి రాశిగా పోసిన పచ్చిమిర్చి

తెగుళ్లతో సతమతం



పచ్చి మిర్చి తోటలకు రకరకాల తెగుళ్లు వ్యాపించడంతో పురుగుమందులు పిచికారీ చేసేందుకు వేలాది రూపాయలు వెచ్చించాల్సి వస్తుంది. పురుగు మందుల ధరలు, కూలీ రేట్లు పెరిగిపోయాయి. వ్యాపారస్తులు సిండికెట్ అవటం వల్ల రైతుకు సరైన ధర పలకడం లేదు. కనీసం బస్తాకు రూ.2000 ధర కల్పిస్తే కొంత మేరకు రైతుకు గిటుబాటు అవుతుంది.

– వై నాగేశు, రైతు, కొణిజర్ల

కౌలు కూడా చెల్లించటం కష్టం



ప్రస్తుతం పచ్చి మిర్చికి లభిస్తున్న ధరతో కనీసం భూమికి కౌలు కూడా చెల్లించటం కష్టం, మిర్చి బస్తా ధర రూ.1,200 ఉంది. బస్తా మిర్చికోస్తే రూ.550 కూలీలకు చెల్లించాల్సి ఉంది. ఎకరాకు నీటితో కలిపి రూ.45 వేలు కౌలు చెల్లించాల్సి ఉంది. ఎకరాకు సుమారు రూ.15 వేలు పెట్టుబడులు పెట్టడం జరిగింది. ఈవిధంగా ఖర్చులు పోతే ఇక కౌలు రైతుకు మిగిలేది ఏముంది. కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– డి సాంబయ్య, కౌలు రైతు, ధర్మాజీగూడెం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ద్వారకాతిరుమల: స్థానిక 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఈఈ కేఎం అంబేద్కర్ మంగళవారం పేర్కొన్నారు. విద్యుత్ తీగలకు తగిలే చెట్ల కొమ్మలు తొలగిస్తామన్నారు. ఈ క్రమంలో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ద్వారకాతిరుమల, కొమ్ముగూడెం, లక్ష్మీపురం, దొరసానిపాడు, గుండుగొలనుకుంట కాలనీ, రాళ్లకుంట, సత్తెన్నగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు.

కళ్లచెరువు- కామవరపుకోట రోడ్డుకు మోక్షం

కామవరపుకోట: రోడ్డు వేశారు.. తారు మరిచారు శీర్షికన సాక్షిలో ఇటీవల ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దీంతో శరవేగంగా రోడ్డు పనులు చేపట్టారు. కామవరపుకోట, పాతూరు నుంచి అంకాలంపాడు, జలపవారిగూడెం, కళ్లచెరువు వరకు గతంలో రూ.7.40 కోట్లతో రోడ్డు పనులు చేపట్టి వదిలేశారు. దీంతో రోడ్డు మొత్తం కంకరరాళ్లు పైకి లేచి ఉండడంతో గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బంది ఎదుర్కొనేవారు. అధికారులు రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టడంతో చుట్టుపక్కల ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శ్రీవారి పథకాలకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి పథకాలకు ఒక భక్తుడు మంగళవారం రూ.3,00,232 విరాళంగా అందజేశారు. ఏలూరుకు చెందిన పెద్ది రవీంద్ర ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం గోసంరక్షణ పథకానికి రూ.1,00,116, నిత్యాన్నదాన పథకానికి రూ. 2,00,116 ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ హయగ్రీవాచార్యులు విరాళం బాండ్ పత్రాలను అందించారు.

30న పతాక యాత్ర

వేలేరుపాడు: స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో మండల కమిటీ సమావేశం కారం వెంకట్రావు అధ్యకతన నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి ధర్ముల రమేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మడివి దుర్గారావు మాట్లాడుతూ వచ్చేనెల 1,2,3 తేదీల్లో నెల్లూరులో సీపీఎం రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్న నేపథ్యంలో రాష్ట్రంలోని ఐదు ప్రధాన సమస్యలపై చర్చించేందుకు రాష్ట్రవ్యాప్తంగా పతాక యాత్రలు చేపడుతున్నట్లు తెలిపారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై రాష్ట్ర మహాసభలో చర్చించి భవిష్యత్తు పోరాటాలకు రూపకల్పన చేస్తామన్నారు. జీపు జాత 29న కూనవరంలో ప్రారంభమై 30వ తేదీన వేలేరుపాడు చేరుతుందని తెలిపారు. పతాక యాత్రలో పార్టీ కార్యకర్తలు, నిర్వాసిత ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో గుమ్మల నర్సయ్య, కుంజా దుర్గ, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

సారా కేసులో నిందితుల అరెస్ట్

పోలవరం రూరల్: సారా తయారీ, విక్రయం కేసులో నిందితులను మంగళవారం పోలవరం ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఎల్ఎన్‌డీపేట, పోలవరానికి చెందిన ఇద్దరు పాత ముద్దాయిలు సంసాని సతీష్, ముంగర అంజియ్యతో పాటు నీలం కృష్ణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ కె.వీరబ్రహ్మం తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.సునీల్‌కుమార్, పి.సునీల్‌కుమార్, ఎ.రాజేష్, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డు గ్రహీతలకు సన్మానం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం మండల తహసీల్దార్ కె.చెల్లన్నదొర, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ టి.మణిదివ్యను మండల ప్రజాప్రతినిధులు మంగళవారం ఘనంగా సత్కరించారు. తహసీల్దార్ కార్యాలయంలో సర్పంచ్‌ల ఛాంబర్, ఎంపీటీసీల సభ్యులు అధికారులు ఇరువురికి పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. జిల్లా ఉత్తమ ఎలక్ట్రోరల్ అధికారిగా తహసీల్దార్, ఉత్తమ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా ఆర్ఐ అధికారు ఇరువురు సీఎస్, కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నందుకు వారిని అభినందించారు. అచ్యుతాపురం సర్పంచ్ మద్దిపాటి నాగమణి, వేదాంతపురం సర్పంచ్ జీటీఎస్ రాజు, బయ్యనగూడెం సర్పంచ్ లింగిశెట్టి అనంతలక్ష్మి, రాజవరం సర్పంచ్ ఏలేటి తుక్కయ్య, కన్నాపురం సర్పంచ్ ఉప్పల పద్మావతి, బోడిగూడెం సర్పంచ్ కడకట్ల గడ్డియ్య, దిప్పకాయలపాడు సర్పంచ్ సున్నం శాంతికుమారి, యర్రంపేట సర్పంచ్ చాపల ఏసురత్నం, ఎంపీటీసీలు కె.చింతయ్య, నారా దేవి అన్నపూర్ణ, సీతారత్నం పాల్గొన్నారు.


కొయ్యలగూడెం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

కామవరపుకోటలో కప్పేసిన మంచు దుప్పటి

కామవరపుకోట: మండల పరిసర ప్రాంతాల్లో పగలు 10 గంటలైనా పొగ మంచు వీడడం లేదు. కొన్ని రోజుల నుంచి చలి తీవ్రతతో పాటు దట్టంగా పొగ మంచు తెల్లవారక ముందే దుప్పటిలా కమ్ముకుంటోంది. వీధులు, రోడ్లు వెంబడి వెళ్లాలంటే సరిగ్గా దారి కనపడక స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పొగ మంచుతో ప్రధాన రహదారుల్లో వాహనదారులు వెళ్లాలంటే ఎదురుగా వచ్చేవారు కనపడక ప్రమాదాలు జరుగుతాయని పలువురు భయపడుతున్నారు. ఉదయాన్నే నడక వ్యాయామం చేసేవారు, పాడి రైతులు, వ్యవసాయ పనులకు వెళ్లేవారు. పాఠశాల వెళ్లే విద్యార్థులు ఈ మంచు పొరతో ఇబ్బంది పడుతున్నారు. రహదారులపై వెళ్లే వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాలని ఈ మంచుతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.


ద్వారకాతిరుమల వెళ్లే రోడ్డులో ఉదయం 8 గంటలైనా వీడని పొగ మంచు

పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

బుట్టాయగూడెం: మార్చి 15వ తేదీ నుంచి నిర్వహించనున్న పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కె.రాముల నాయక్ అన్నారు. మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏ సమావేశ మందిరంలో మంగళవారం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, ఏటీడబ్ల్యూఓలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలకు సంబంధించి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి సమావేశాలు ఏర్పాటు చేసి సమీక్షించాలని చెప్పారు. పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేస్తానని చెప్పారు. వసతి గృహాల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలన్నారు. పాఠశాలల్లో మరమ్మతు పనులుంటే పరిష్కరించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ పీవీఎస్ నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ లత, జీసీసీ డీఎం జి.పార్వతీశ్వరరావు, ఏటీడబ్ల్యూఓలు, డీవైఈఓ, పీఎమ్ఆర్‌సీ, అధికారులు పాల్గొన్నారు.


కేఆర్‌పురం ఐటీడీఏలో మాట్లాడుతున్న పీఓ రాముల నాయక్

మద్యం షాపునకు దరఖాస్తుల ఆహ్వానం

పోలవరం రూరల్: పోలవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కొయ్యలగూడెం మండలంలో ఒక మద్యం దుకాణం శెట్టి బలిజ కులానికి కేటాయించినట్లు పోలవరం ఎక్సైజ్ సీఐ కె.వీరబ్రహ్మం తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం 2024–2026 సంవత్సరానికి 10 శాతం మద్యం దుకాణాలను గీత కార్మికుల కులాలకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ ఉత్తర్వుల ప్రకారం షాపు కేటాయించామన్నారు. దీనికి సంబంధించి ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పోలవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌స్టేషన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తు రుసుము రూ. 2లక్షలు చెల్లించాలని తెలిపారు. శెట్టి బలిజ కులానికి చెందిన అభ్యర్థి తమ దరఖాస్తును నేరుగా ఆన్‌లైన్‌లో, హైబ్రీడ్ మోడల్‌లో లేదా నేరుగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అందజేయాలని తెలిపారు. ఫిబ్రవరి 7వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ఏలూరు కలెక్టరేట్‌లో లాటరీ పద్ధతిలో మద్యం షాపులను ఎంపిక చేసి కేటాయిస్తారని తెలిపారు.

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ, జంగారెడ్డిగూడెం మండలంలోని గీత కార్మికులకు కేటాయించిన మద్యం షాపులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు మంగళవారం తెలిపారు. జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ పరిధిలో శెట్టిబలిజ, జంగారెడ్డిగూడెం రూరల్‌కి గౌడ కులాల వారు అర్హులని తెలిపారు. దరఖాస్తులను ఈ నెల ఫిబ్రవరి 5వ తేదీ వరకు జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ స్టేషన్‌లో స్వీకరిస్తామని తెలిపారు. డ్రా తీసి షాపులు కేటాయిస్తామని సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. వివరాలకు స్థానిక ఎక్సైజ్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు భద్రత కల్పించాలి

కొయ్యలగూడెం: ఎన్ఆర్ఈజీఎస్ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు ఎంపీడీవో కార్యాలయం వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లాలో ఫీల్డ్ అసిస్టెంట్ హత్యను నిరసిస్తూ దోషులను కఠినంగా శిక్షించాలని అన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్న కుటుంబానికి ప్రభుత్వం రూ. 30 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని, అతని భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, పక్కా గృహం నిర్మించాలని కోరుతూ ఎంపీడీఓ కె.కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు.

గుర్తింపు లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

కామవరపుకోట: మండలంలో ప్రభుత్వ గుర్తింపు లేకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్న ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యంపై అధికారులు చర్య తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల టౌన్ కన్వీనర్ నాది సాగర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు తహసీల్దార్ జి.ఎలీషాకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ గుర్తింపు లేకుండా అడ్మిషన్లు చేసి విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. దొప్పసాని రాంబాబు, రోహిత్, నాగేంద్ర పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్యపై దృష్టి సారించాలి

చింతలపూడి: నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని వెంటనే దీనిపై ప్రధాని మోదీ దృష్టి సారించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని పాత చింతలపూడిలో సీపీఐ శాఖ మహాసభ మంగళవారం బోడ వజ్రం అధ్యక్షతన నిర్వహించారు. మహాసభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కృష్ణ చైతన్య మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ నేతృత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 ఏళ్లు కావస్తున్నా ఇప్పటికీ నిరుద్యోగ సమస్య అలాగే ఉందని అన్నారు. అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ అందులో ఉన్న ఉద్యోగాలను తొలగిస్తున్నారని ఆరోపించారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెంచిన కరెంటు చార్జీలను తక్షణం తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాత చింతలపూడిలో సమస్యలను పరిష్కరించాలని మండల సీపీఐ కార్యదర్శి కె గురవయ్య కోరారు. తొలుత సీపీఐ జెండాను బోడ వజ్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో శాఖ కార్యదర్శి ముల్లగిరి నాగేశ్వరావు, సహాయ కార్యదర్శి తోర్లపాటి రాజు, మండల సహాయ కార్యదర్శి తొర్లపాటి బాబు, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


పాత చింతలపూడిలో సీపీఐ శాఖ మహాసభ సందర్భంగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆశా వర్కర్లపై ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ

చింతలపూడి: ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపుతోందని ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె పోశమ్మ ఆరోపించారు. మండల ఆశా వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం మంగళవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం వద్ద ఆశ యూనియన్ మండలాధ్యక్షురాలు సీహెచ్ పుణ్యవతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షురాలు కె పోశమ్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశ వర్కర్లకు పని భారం పెంచారని, 2024లో సమ్మె సందర్భంగా ఆశ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీఎస్ నారాయణ మాట్లాడుతూ ఫిబ్రవరి 5న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నాయని తెలిపారు. యూనియన్ మండల గౌరవ అధ్యక్షుడు బాలరాజు, ఆశా వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి సరళ, కోశాధికారి సంపూర్ణమ్మ పాల్గొన్నారు.


ఆశ వర్కర్ల జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు కె పోశమ్మ

సమన్వయంతో ప్రజా సమస్యలను పరిష్కరించాలి

- జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం
- రూ. 60.09 లక్షల మిగులుతో బడ్జెట్ ఆమోదం

జంగారెడ్డిగూడెం: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అధ్యక్షతన 2025–26 బడ్జెట్‌కు సంబంధించి సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ 2025–26 సంవత్సరానికి రూ.60.09 లక్షల మిగులుతో బడ్జెట్‌ను పాలకవర్గం ఆమోదించింది. బడ్జెట్‌లో ప్రారంభ నిల్వ రూ.3.13 కోట్లుగా చూపారు. మున్సిపాలిటీ ఆదాయపు అంచనా రూ.16.94 కోట్లుగా పేర్కొన్నారు. మొత్తం ఖర్చు రూ.19.48 కోట్లు. దీనికి సంబంధించి ఆస్తి పన్ను, కేంద్ర నిధులు, స్టాంప్ డ్యూటీ తదితర ఆదాయాలు ఆదాయ మార్గాలుగా చూపారు. మున్సిపాలిటీలో సిబ్బంది జీతాలకు సంబంధించి రూ.3.74 కోట్లు, నిర్వహణ వ్యయం రూ.5.02 కోట్లుగా బడ్జెట్‌లో లెక్కలు చూపారు. నీటి సరఫరాకు 23 శాతం రూ.86.49 లక్షలు, కాలువలకు సంబంధించి 15 శాతం రూ.56.21 లక్షలు, రోడ్లకు రూ.22 శాతం రూ.82.16 లక్షలు, వినోదానికి సంబంధించి రూ.43.24 లక్షలు, వీధి దీపాల నిర్వహణకు సంబంధించి 8 శాతం రూ.30.27 లక్షలు, మార్కెట్లు, పార్కులు, భవనాలు, సామాజిక భవనాలు తదితర అంశాలకు 20 శాతం రూ.73.51 లక్షలు కేటాయించారు. వీటి మొత్తానికి రూ.3.72 కోట్లు కేటాయించారు. సామాజిక అభివృద్ధికి సంబంధించి షెడ్యూల్ కులాల అభివృద్ధికి 15 శాతం రూ.55.78 లక్షలు, షెడ్యూల్ తెగల అభివృద్ధికి రూ.7.5 శాతం రూ.27.89 లక్షలు, మహిళా శిశు సంక్షేమానికి 5 శాతం రూ.18.59 లక్షలు, విభిన్న ప్రతిభావంతులకు 3 శాతం రూ.11.15 లక్షలు, మొత్తంగా రూ.1.02 కోట్లు కేటాయించారు. సమావేశంలో కమిషనర్ కేవీ రమణ, ఆర్ఐ ఎస్. సుబ్బారావు, మేనేజర్ రమణి, టీపీవో చాందిని, ఏఈ రాజేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణ, హెల్త్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్, ఈఐ సోమరాజు పాల్గొన్నారు. అనంతరం చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి అజెండాలో పేర్కొన్న పలు అంశాలను కౌన్సిల్ తీర్మానంతో ఆమోదించారు.


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి


జంగారెడ్డిగూడెం మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో హాజరైన కౌన్సిల్ సభ్యులు

దళితుల దరఖాస్తుల పరిష్కారంపై నిర్లక్ష్యం

జంగారెడ్డిగూడెం: దళితుల దరఖాస్తులు పరిష్కారంపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ అన్నారు. జంగారెడ్డిగూడెం ప్రజాసంఘాల కార్యాలయంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా కమిటీ సభ్యులు పల్లి రాజు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్రాన్సిస్ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలో మాల, మాదిగ కులానికి చెందినవారు వివిధ సమస్యలపై అధికారులకు అందించిన దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురంలో ముప్పిడి రాజును అత్యంత దుర్మార్గంగా హత్య చేసి చెరువులో పడేస్తే న్యాయం కోసం ప్రజా ఉద్యమం చేశామన్నారు. దీంతో 2021 ఆగస్టు 14న కేసు నమోదు చేశారని తెలిపారు. ముప్పిడి రాజు హత్యకు సంబంధించిన పోస్టుమార్టం రిపోర్ట్ ఇప్పటికీ ఇవ్వలేదని తెలిపారు. ఆ కుటుంబానికి నష్టపరిహారం, ఒకరికి ఉద్యోగం, తల్లికి పెన్షన్, ఇల్లు నిర్మిస్తామని అధికారులు హామీ ఇచ్చి నేటికీ అమలు చేయలేదన్నారు. కేసు దర్యాప్తు చేసి దోషుల్ని అరెస్టు చేయాలని ఫ్రాన్సిస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2024 డిసెంబర్ 29న జంగారెడ్డిగూడెం మండలం తిరుమలపురంలో దళిత యువకులు మన్నెల్లి నాగేశ్వరావు, అందుగుల విజయ్ కుమార్‌ని కర్రలతో కొట్టి కత్తితో నరికిన నిందితులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు, 307 కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దళితుల పట్ల అధికారులు వివక్ష చూపుతున్నారని అన్నారు. దళితులపై దాడి చేసి హత్య చేసిన నేరస్తుల్ని అరెస్టు చేసి శిక్షించాలని కోరారు. లేనిపక్షంలో ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధితులు మన్నెల్లి నాగేశ్వరావు, ముప్పిడి ఏసు, ఎం.వెంకటరావు, కె.సుబ్బారావు, నాగార్జున బాబూరావు పాల్గొన్నారు.


జంగారెడ్డిగూడెంలో కేవీపీఎస్ సమావేశంలో మాట్లాడుతున్న ఎ.ఫ్రాన్సిస్